ఓయూ అంతటా రెడ్ అలర్ట్

- 500 పోలీసులు, మూడంచెల భద్రత
- రెండు మార్గాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించిన ఎన్నికల అధికారి హేమంత్‌కేశవ్ పాటిల్, ఇతర అధికారులు

సికింద్రాబాద్: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ అంతటా సిటీ పోలీసులు రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని సికింద్రాబాద్, సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఇక్కడ పూర్తి చేయనున్నారు. ఓయూ ప్రాంగణంలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవనంలో సికింద్రాబాద్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ భవనంలో సనత్‌నగర్ అసెంబ్లీ ఓటర్ల లెక్కింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు కట్టుదిట్టమైన పోలీసు భద్రతతో పాటు, అవసరమైన ఇతరత్రా ఏర్పాట్లు చేశారు.

భారీ బందోబస్తు..

రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఓయూ ప్రాంగణంలో జరుగుతున్న క్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ నేతృత్వంలో ఐదుగురు ఏసీపీలు సహా సుమారు 500 మంది పోలీసులు భద్రత విధుల్లో పాల్గొంటున్నారు. ఓయూ పీఎస్ నుంచి ఎన్‌సీసీ గేట్ వెళ్లే మార్గంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ భవనం, తార్నాక కూడలి నుంచి అడిక్‌మెట్ వెళ్లే మార్గంలో ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్లు ఉన్నాయి. ఈ రెండు మార్గాల్లో ఆసాంతం పోలీసు పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు. రెండు భవనాల ప్రవేశ మార్గాల్లో మూడంచెల పోలీసు తనిఖీలు ఏర్పాటు చేశారు. ఈ మార్గాల్లో సోమవారం సాయంత్రం నుంచే వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

కేంద్రాల సందర్శన..

ఓయూ ప్రాంగణంలోని రెండు కౌంటింగ్ కేంద్రాలను సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్‌కేశవ్ పాటిల్, కౌంటింగ్ అబ్జర్వర్ సరోజ్‌కుమార్, ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ సందర్శించారు. ఓట్ల లెక్కింపు కోసం చేసిన ఏర్పాట్లు సందర్శించారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థుల ఏజెంట్ల ప్రవేశం కోసం ఇప్పటికే ఎన్నికల అధికారులు పాస్‌లు జారీ చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోలైన 1,39,721 ఓట్ల లెక్కింపు చేసేందుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. టేబుల్‌కు ముగ్గురు చొప్పున లెక్కింపు సిబ్బందిని నియమించారు. ఒక్కో రౌండ్‌కు సుమారు 10 వేల ఓట్ల చొప్పున 16 రౌండ్లలో ఎన్నికల లెక్కింపు పూర్తి చేస్తారు. పోస్టల్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేకంగా మరో రెండు టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియను పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభించనున్నారు. 9 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభం చేస్తారు. 42 మంది అభ్యర్థులు ఉండటంతో మధ్యాహ్నం 2 గంటల లోపు లెక్కింపు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

పకడ్బందీ చర్యలు తీసుకున్నాం..



ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం ప్రొఫెసర్ రామిరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ వద్ద భారీ భద్రతా ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ నోడల్ అధికారి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడే ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్ హెడ్‌క్వార్టర్‌తో పాటు రిజల్ట్ డిక్లేర్ చేసేది కూడా ఈ కేంద్రంలోనే ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 180 మంది పోలీసులతో మూడంచెల భద్రత బలగాలను మోహరించినట్లు చెప్పారు. సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో గెలిచిన అభ్యర్థులు ర్యాలీలు తీయడం, క్రాకర్స్ కాల్చడం చేయరాదన్నారు.

కౌంటింగ్ కేంద్రం చుట్టూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి..



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు డీసీపీ రంగారావు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ వెస్లీ కళాశాల ఆవరణలో ఈ నెల 4 (నేడు) జరగనున్న కంటోన్మెంట్ ఉప ఎన్నికల కౌంటింగ్ కేంద్రం చుట్టూ పక్కల ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాఫిక్ అదనపు డీసీపీ రంగారావు సూచించారు. సోమవారం వెస్లీ కళాశాల ఆవరణలో ఉత్తర మండలంలో ఏసీపీ ఎన్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీరోడ్ హనుమాన్ దేవాలయం వద్ద చెక్‌పోస్టు ఉంటుందని కౌంటింగ్ కేంద్రం లోపలికి వచ్చే కార్లకు రిటర్నింగ్ అధికారి ఇచ్చిన పాస్‌లు ఉంటేనే అనుమతించాలన్నారు. ఒక ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కళాశాల లోపల పార్కింగ్ దగ్గర కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వచ్చి వెళ్లే వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ఒక టీమ్ లోపల ఉండాలని చెప్పారు. కేంద్రం చుట్టూ 3 పికెట్లు ఏర్పాటు చేశామని ఈ ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కువ మంది గుమిగూడకుండా చూడాలని చెప్పారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి



అమరుల సంస్మరణ సభలో ఐక్యతను చాటుతున్న ఉద్యమకారులు

లాలాపేట: సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేసి తగిన న్యాయం చేయాలని పలువురు వక్తలు కోరారు. సోమవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయూవీ) చైర్మెన్ కంచర్ల బద్రి అధ్యక్షతన ఓయూలో తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దశాబ్ద కాలంగా తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ దశాబ్ది వేడుకలకు ఉద్యమకారులను ఆహ్వానించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఉద్యమకారులకు ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించడంలో కార్యచరణ ప్రారంభించాలన్నారు. ఓయూలో అమరవీరుల స్థూపం నిర్మాణం చేయడంతో పాటు ఇప్పటి వరకు సహాయం అందని అమరుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. 2009 నుంచి 2014 వరకు జరిగిన ఉద్యమంలో తమ విలువైన సమయాన్ని కోల్పోయామని అందుకుగాను ప్రభుత్వం ఇచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లలో ఉద్యమకారులకు వయోపరిమితి సడలించడంతో పాటు వెయిటేజి మార్కులు కల్పించాలన్నారు. ఉద్యోగాలు రాని ఉద్యమకారులను ఆర్థిక సహాయం అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలనీ పేర్కొన్నారు. స్వతంత్ర సమరయోధులుగా గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమ సమయంలో తమపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రొ. తాటికొండ వెంకట రాజయ్య, ప్రొ. పంత్కాల శ్రీనివాస్, విద్యార్థి ఉద్యమ నాయకులు దరువు ఎల్లన్న, జంపాల రాజేష్, మందాల భాస్కర్, దుర్గం భాస్కర్, రవీందర్ నాయక్, కృష్ణ, లత, రాధిక పాల్గొన్నారు.

గోపీనాథ్ ముండే జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న వంజరి సేవా సంఘం నాయకులు

బౌద్ధనగర్: గోపీనాథ్ ముండే జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి తెలంగాణ వంజరి సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గోపీనాథ్ ముండే వర్ధంతి సందర్భంగా బౌద్ధనగర్‌లో సోమవారం కార్యక్రమం నిర్వహించిన ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ, ఎంబీసీ వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నేత గోపీనాథ్ ముండే అని కొనియాడారు. గోపీనాథ్ ముండే కలలు నిజం కావాలంటే దేశవ్యాప్తంగా ఒకే కులానికి ఒకే రిజర్వేషన్ అన్న విధానం అమల్లోకి తీసుకువచ్చి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న వంజరి కులస్తులకు డీ.ఎన్.టీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వంజరి కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పేదరికంలో మగ్గుతున్న వంజరి కులస్తులకు ప్రత్యేక ఆర్థిక సహకారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వంజరి సేవా సంఘం ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎదుగని శంకర్‌నారాయణ, ధాత్రిక ధర్మరాజు, హరినాథ్, గంగరాజు, కాలేసు సురేష్, రూపాజ్యోతి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న శేషుకుమారి

అమీర్‌పేట: మగ్నస్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వయో వృద్ధులకు కేన్సర్ మార్కర్ (పీఎస్‌ఏ) టెస్టులు చేశారు. ఈ సందర్భంగా డయాగ్నోస్టిక్స్ ఎండీ సింగం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. 50 ఏళ్లు పైబడ్డ వ్యక్తులు ఎవరైనా సరే ప్రతియేటా పీఎస్‌ఏ వైద్య పరీక్ష చేయించుకోవడం మంచిదని దీని ద్వారా ప్రాథమిక దశలో కేన్సర్ కారకాలను గుర్తించి వైద్యం చేయించుకుంటే కేన్సర్‌ను జయించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సహదేవ్‌గౌడ్, కూతురు నర్సింహ, లింగమయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దానకిషోర్‌కు వినతి



దానకిషోర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఓయూ ఉద్యోగులు

లాలాపేట: సమస్యలు పరిష్కరించాలని ఓయూ బోధనేతర ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ దానకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. 2001- 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని, సెప్టెంబర్ 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేయాలన్నారు. బోధనేతర ఉద్యోగుల పదవుల్లో టీచర్లను నియమించవద్దని పదోన్నతుల అవకాశం కల్పించాలన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ మధ్య ఒకే రకమైన సర్వీస్ కండీషన్స్ అమలు చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఎన్‌జీఓస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్, నాగరాజు, శివ, శంకర్, విజయ్‌కుమార్, అక్బర్ భేగ్, భీమయ్య, శంకరయ్య, అశోక్, యూసూఫ్, రాకేష్, కృష్ణ, జలీల్, ఇక్బాల్, సాంబయ్య, గోపాల్, బిక్షపతి, రాజేశ్వర్‌రావు, మెహతాబ్ ఉన్నారు.

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి నిమిషం ఫలితాలపై దృష్టిపెట్టాలని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ సూచించారు. పార్లమెంట్ పరిధిలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, సికింద్రాబాద్, ముషీరాబాద్, అంబర్‌పేట, నాంపల్లి నియోజకవర్గాల కాంగ్రెస్ ఏజెంట్ల సన్నాహక సమావేశం సోమవారం బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో జరిగింది. 120 మంది కౌంటింగ్ ఏజెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకే ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌లోకి చేరుకోవాలన్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మవద్దని, భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలవబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ మామిడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నేతలు నాగభూషణం, బండ సురేష్, శ్రీనివాస్‌యాదవ్, మహేందర్, సుదీప్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

19న సదస్సు



కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: సమతా ధ్యాత్మిక మూర్తి అన్నమయ్య జయంతి సందర్భంగా 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకావిష్కరణ, ద్వేషం, అసమానత్వాలకి వ్యతిరేకంగా హిందూమతం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర స్వామి తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ అధ్యక్షుడు శ్రీ సాధు త్రినాథ దాస్, బిర్లామందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఈ నెల 19వ తేదీన అన్నమయ్య జన్మదినం సందర్భంగా హైదరాబాద్ బిర్లా సైన్స్‌సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 20, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 125, గింజ బీక్కుడు 75, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 23, రూట్ రూట్ 21, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 31, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 70, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ప్రశాంతంగా టీఎస్ లాసెట్

లాలాపేట: టీఎస్ లాసెట్-2024 సోమవారం ప్రశాంతంగా జరిగింది. కంప్యూటర్ బేస్డ్ టెస్టు మూడు షిఫ్టులుగా ఉదయం 9 నుంచి 10.30 వరకు, 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగింది. తెలంగాణలో 79.68, ఏపీలో 71.58, మొత్తంగా 79.45 శాతం మంది అభ్యర్థులు లాసెట్ పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్ విజయలక్ష్మీ తెలిపారు. దీనికి సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 6న వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు.

యువతి అదృశ్యం

బౌద్ధనగర్: ఉద్యోగానికని వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సునీత వివరాల ప్రకారం..వారాసిగూడకు చెందిన స్వప్న(19) నామాలగుండులోని విశాల్‌మార్ట్‌లో పని చేస్తోంది. రోజు మాదిరిగానే సోమవారం ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. స్వప్న పని చేసే వద్ద వెళ్లిన వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని 193/27 డీఎన్ లైన్ వద్ద వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని పట్టాలపై తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై తెల్లని బనియన్, బిస్కెట్ రంగు ప్యాంటు ఉన్నాయని సంబంధీకులు ఉంటే 8712658581నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా



సాయికుమార్‌ను అభినందించిన ఆర్. కృష్ణయ్య

పద్మారావునగర్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన సాయికుమార్‌ను రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అభినందించారు. ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సాయికుమార్ ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచస్థాయిలో నిలిపిన సాయికుమార్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కృషి, పట్టుదల ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన కోసం ప్రయత్నిస్తే ఎదైనా సాధించడానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ, నాయకులు రామారావు, సతీష్ యాదవ్ పాల్గొన్నారు.

అమీర్‌పేటలో యథేచ్ఛగా అక్రమ బోర్‌వెల్ పనులు



బీకేగూడలో అనుమతి లేకుండా వేస్తున్న బోరు

అమీర్‌పేట: అమీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయ పరిధిలో యథేచ్ఛగా అక్రమ బోర్‌వెల్ పనులు జరుగుతున్నాయి.ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్నారు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్న తరుణంలో ఇష్టానుసారంగా బోర్లు వేస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తుంది. బోరు కోసం రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న కొందరు అధికారుల నుంచి అనుమతులు రానప్పటికీ బోర్లు వేసుకుని నీటి దోపిడీకి పాల్పడుతున్నారు. మరి కొందరు అనుమతులు ఇచ్చిన దానికన్నా ఎక్కువ వేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమీర్‌పేట మండల పరిధిలో రోజుకు 10- 20 బోర్లు వేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ బోర్‌వెల్ పనులపై దృష్టి సారించి భూగర్భ జలాలను పరిరక్షించాలన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రసూల్‌పురా: మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాల్లో 2005-06లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 18 ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అందరు ఒకే చోటు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు నరహరి మాట్లాడుతూ.. 18 సంవత్సరాల తర్వాత తమను పిలిచి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకునందుకు పూర్వ విద్యార్థులను అభినందించారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థానంలో ఉండడం తమకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లోకేష్, భాస్కర్, దేవులపల్లి రాజు, ఉపాధ్యాయులు శ్రీలత, లత, వాహిదా, స్వాతి, రత్నకుమారి, నరహరి, హనుమంతు, గోపాల్ రెడ్డి, మానిక్ రెడ్డి, నజీమొద్దీన్, వెంకట్ రెడ్డి, ఉమాపతి పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో సత్తా



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

లాలాపేట: పాలిసెట్ ఫలితాల్లో తపస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ మేరకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి మే 23 వరకు నగరంలోని పలువురు పేద విద్యార్థులకు పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్టు కోసం ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందించింది. మే 24న ప్రభుత్వం పాలిసెట్ అర్హతా పరీక్ష నిర్వహించగా సోమవారం వాటి ఫలితాలను వెలువడ్డాయి. తపస్ అందించిన ఉచిత శిక్షణతో 300 మంది ఆన్‌లైన్ శిక్షణ, మరో 500 మంది వాట్సాప్ ద్వారా స్టడీ మెటీరియల్ తీసుకుని ప్రిపేర్ అయిన విద్యార్థులంతా అర్హత సాధించినట్లు తపస్ రాష్ట్ర సహ అధ్యక్షులు ఉషారాణి తెలిపారు. వెయ్యి లోపు ర్యాంక్ సాధించిన వారు 10 మంది విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తపస్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి అభినందనలు తెలిపారు. గత 15 ఏళ్ల నుంచి తాము ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ లీడర్లు కళావతి, రజనీదేవి, ఉపాధ్యాయులు అనిత, శ్రీధర్,రజనీకుమార్, గంగా భవాణి, అన్నపూర్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందించిన చిరంజీవి

సికింద్రాబాద్: పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సాయి విద్యాలయ విద్యార్థులను ముషీరాబాద్ మండల డిప్యూటీ విద్యాశాఖ అధికారి చిరంజీవి అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన 26 మంది విద్యార్థులకు సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవార్డులు, జ్ఞాపికలు అందజేశారు. కరస్పాండెంట్ ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ.. తమ పాఠశాల నుంచి 106 మంది పరీక్షలకు హాజరవ్వగా 102 మంది ఉత్తీర్ణత సాధించిచారన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ మండల పాఠశాలల డిప్యూటీ పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలో బీసీలకు అన్యాయం'



మాట్లాడుతున్న ప్రొ గాలి వినోద్‌కుమార్

లాలాపేట: కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రం, తెలంగాణ రాష్ట్రంలోనూ బీసీలకు తీరని అన్యాయం చేసిందని సౌత్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు. సోమవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోనియాగాంధీ నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే రాష్ట్రంలో 52 శాతానికి పైగా ఉన్న బీసీ సీనియర్ నాయకులు వి. హనుమంతారావును ముఖ్యమంత్రిని చేసేదని పేర్కొన్నారు. ఉత్తరాది ఆధిపత్యాన్ని దేశంలో శాశ్వతంగా కొనసాగించడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై వారికి పట్టింపు లేదన్నారు. ఉత్తరాది పాలకుల ఆధిపత్యం నుంచి దక్షిణాదిని రక్షించుకోవాలంటే స్వయంపాలన, ఆత్మగౌరవం దిశగా మరో పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు



జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ జీహెచ్‌ఎంసీ కో ఆప్షన్ సభ్యులు నరసింహారావు ముదిరాజ్ ఆధ్వర్యంలో గండిమైసమ్మ దేవాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, మురళి యాదవ్, ప్రవీణ్, క్రిష్టఫర్, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడి బైక్ చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్, సీఐ చంద్రశేఖర్

హిమాయత్‌నగర్: జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తితో పాటు మైనర్‌ను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుండి దొంగిలించిన ఒక ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. గత నెల 22న బర్కత్‌పురా ప్రాంతానికి చెందిన అర్కపల్లి శిథిరాజు తన ఇంటి ముందు పార్క్ చేసిన టీవీఎస్ బైక్ కనిపించడం లేదంటూ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు, రాంకోఠి చౌరస్తాలో వాహన తనిఖీలలో అంబర్‌పేట్‌కు చెందిన సిమోన్ రాజ్, నాంపల్లికు చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడు దొంగతనానికి గురైన బైక్‌తో పట్టుపడ్డారు. వారిని విచారించగా ఆ బైక్‌ను దొంగలించినట్లు ఒప్పుకున్నారు.నిందితులు సిమోన్ రాజ్ వాల్ పెయింటింగ్, మైనర్ బాలుడు మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి వచ్చే డబ్బులు సరిపోక ఇలా దొంగతనాలు చేస్తూ , జల్సాలు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సిమోన్ రాజ్ గతంలో నారాయణగూడ , అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, బెయిల్ పై బయటకి వచ్చి ఇలా దొంగతనాలు చేస్తున్నట్లు ఏసీపీ శంకర్ తెలిపారు. వారి పై కేసు నమోదు చేసి సిమోన్ రాజ్‌ను రిమాండ్‌కు, మైనర్ బాలుడిని జ్యూవెనల్ హోమ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.